నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 11 జూన్ 2025 | NALGONDA

## రేపటి నుంచి ఇగ్నో పరీక్షలు



రామగిరి, జూన్ 10: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) డిగ్రీ అండ్ పీజీ, డిప్లొమా కోర్సుల పరీక్షలు ఈనెల 12 నుంచి జూలై 19 వరకు జరగనున్నట్లు యూనివర్సిటీ నల్లగొండ స్టడీ సెంటర్, కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇందిరాగాంధీ వర్సిటీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 94924 51812, 040–23117550 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## చందంపేట ఎంఈవో సస్పెన్షన్




చందంపేట, జూన్ 10: చందంపేట ఎంఈవో చందర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు. చందంపేట మండలం కొర్రతండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న పర్వీన్ సుల్తానా అక్కడ విద్యార్థులు లేకపోవడంతో ఆమెను గాగిళ్లాపురం యూపీఎస్ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. అయినప్పటికీ ఏడాది నుంచి విధులకు గైర్హాజరు కాగా అప్పటి ఇన్‌చార్జ్ ఎంఈవో సామ్యానాయక్ సహకారం అందించినట్లు తేలడంతో, జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యానాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో సహకరించిన గాగిళ్లాపురం యూపీఎస్ పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవ్ సస్పెండ్ అయ్యారు. తాజాగా ఈ వ్యవహారంలో ప్రస్తుత చందంపేట చందర్‌నాయక్ పాత్రపై విచారణ నిర్వహించిన అధికారులు ఈ మేరకు ఆయనను కూడా సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు ఏ దయా?

బాత్‌రూంలోనే నివాసం
పట్టించుకోని పాలకులు
అర్హులకు అందని ఇండ్లు

**ఏండ్లుగా స్నానాల గదినే ఆవాసంగా చేసుకొని దుర్భర జీవితం సాగిస్తున్న ఓ నిరుపేద మహిళ. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్నది. రూ.లక్ష అప్పుచేసి బేస్మెంట్ వేసింది. కానీ.. నేటికీ ఇల్లు మంజూరు పత్రం రాలేదు.**


నివాసం ఉంటున్న బాత్‌రూం వద్ద మందాల పోచమ్మ

తుర్కపల్లి, జూన్ 10: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒంటరి దళిత మహిళ మందాల పోచమ్మ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. రెండేండ్ల కిందట వానలకు పెంకుటిల్లు కూలింది. ఇల్లు కట్టుకునే స్తోమత లేక పోవడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇంటికి సంబంధించిన బాత్‌రూంలోనే నివాసం ఉంటున్నది. కాంగ్రెస్ సర్కార్ గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ప్రజాపాలన సభలో సైతం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ, మంజూరు కాలేదు. ఇల్లు వస్తదని ఇటీవలే మహిళా సంఘాల్లో రూ.లక్ష అప్పు తీసుకొని బేస్మెంట్ లెవల్ నిర్మాణం చేపట్టింది. కానీ నేటికీ ఇల్లు మంజూరు పత్రం రాలేదు. పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఒంటరి మహిళ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నది. ప్రజాపాలనలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పి ఇలా పోచమ్మకు ఇల్లు మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులు అధికారులపై మండిపడుతున్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో.. సర్కారు నిర్లక్ష్యం

**టార్గెట్ 4.5 ఎంటీలు..**
**కొన్నది 3.67 ఎంటీలు**

**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం లక్ష్యం చేరలేదు. నిర్దేశించుకున్న టార్గెట్‌ను అధిగమించలేదు. సుమారు 80వేల మెట్రిక్ టన్నుల వద్ద కొనుగోలుకు దూరంలో ఆగిపోయింది. మరోవైపు సన్నాలకు బోనస్ పేరుతో సర్కారు హడావుడి చేసినా.. వెయ్యి మెట్రిక్ టన్నులు మించలేదు. సర్కారు, మిల్లర్ల కొర్రీలతోనే రైతులు ప్రైవేట్‌లో అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా వద్ద రూ.15 కోట్లు రైతులకు అందాల్సి ఉన్నది. కాగా బీఆర్‌ఎస్ హయాంలో సజావుగా లక్ష్యానికి మించి కొనుగోళ్లు జరిగిన విషయాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు.**

## సర్కారు కొర్రీలతో ప్రైవేట్‌లో అమ్మకాలు

### సన్నాల కొనుగోళ్లు వెయ్యి మెట్రిక్ టన్నులే • ఇంకా రూ. 15 కోట్ల వద్ద పైసలు పెండింగ్

యాదాద్రి భువనగిరి, జూన్ 10 (నమస్తే తెలంగాణ): జిల్లాలో యాసంగిలో 2.80లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారుగా 6.5లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం నాలుగున్నర లక్షల టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 375కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరెంట్ కోతలు, సాగునీరు లేక కరువు తాండవించడంతో వేల ఎకరాల పంటలు కండ్ల ముందే ఎండిపోయింది. మిగిలిన పొలాలకు అష్టకష్టాలు పడి..వచ్చిన దిగుబడిని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడా ఇబ్బందులు తప్పలేదు. మొత్తానికి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. రూ.850 కోట్ల విలువైన 3.67 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 2.06లక్షల ఎంటీల ఏ గ్రేడ్, 1.61 ఎంటీల కామన్ గ్రేడ్ కొనుగోళ్లు చేపట్టారు. 41,136 మంది రైతుల నుంచి వడ్లు సేకరించారు. మొత్తం ధాన్యాన్ని సీఎంఆర్‌కు తరలించారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ. 844 కోట్ల డబ్బులు జమ చేయగా, ఇంకా రూ. 15.6 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

**సన్నాలు వెయ్యి మెట్రిక్ టన్నులే..**

రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ ప్రభుత్వ లెక్కల్లో సన్నాల కొనుగోళ్లు ఆమడ దూరంలో ఉన్నాయి. జిల్లాలో సుమారు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని భావించారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో సన్నాలు అమ్మడానికి రైతులు ఆసక్తి చూపించలేదు. జిల్లాలో 970 ఎంటీల సన్నాలు మాత్రమే కొన్నారు. సర్కారు కొర్రీలు, ప్రైవేట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అంతా ప్రైవేట్‌లోనే అమ్ముకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొనాలంటే 17 శాతానికి లోబడి తేమ శాతం, గింజ పొడవు 6 మి.మీ.లోపు ఉండాలి. గింజ పొడవు, వెడల్పు చూసి మైక్రో మీటర్ ద్వారా గుర్తించాలి. ఇలా పలు కారణాలతో సర్కార్ సన్నాలపై దృష్టి సారించలేదు. చేసేదేంలేక రైతులు ప్రైవేట్ వ్యాపారులపై మొగ్గు చూపారు. ఇక అరకొరగా కొన్న సన్నాలకు బోనస్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.

**కారణాలు కోకొల్లలు..**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తొలుత కొంత మేర ఇబ్బందులు తలెత్తాయి. మెజారిటీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగలేదు. కల్లాల్లో ఎక్కడ పోసిన ధాన్యం కుప్పలు అక్కడే దర్శనమిచ్చాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలకు కొరత ఏర్పడింది. ప్రభుత్వం ధాన్యం కాంటా వేసినా.. తరలింపులో మాత్రం జాప్యం జరిగింది. ప్రధాన కారణంగా లారీ కొరత వెంటాడింది. మరోవైపు హమాలీల సమస్య కూడా వేధించింది. అకాల వర్షాలు రైతులను ఇబ్బందులు పెట్టాయి. అనేక కేంద్రాల్లో వాన నుంచి రక్షించుకునేందుకు సరిపడా టార్పాలిన్లు, షెడ్లు లేవు. దీంతో రైతులు బయట తక్కువ ధరకు అమ్ముకున్నారు. అంతేకాకుండా సీఎంఆర్ భర్తీ చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి, కేసులు నమోదవుతాయనే భయంతో మిల్లర్లు కూడా ధాన్యం కొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం

మఠంపల్లిలో చెత్తాచెదారం
పట్టించుకోని అధికారులు
ప్రత్యేక పాలన అస్తవ్యస్తం


పేరుకుపోయిన చెత్తాచెదారం

మఠంపల్లి, జూన్ 10: మఠంపల్లి మండలంలో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మఠంపల్లి చేపల మార్కెట్ వీధి మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయింది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయింది. వానలు కురిసినప్పుడు మురుగు రోడ్లపైకి వచ్చి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు రోడ్లపైకి, ఇండ్లల్లోకి వస్తుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. విషజ్వరాల బారిన పడకముందే పారిశుధ్య పనులు సత్వరమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య విషయంలో మండలస్థాయి అధికారులు చొరవ తీసుకొని వెంటనే డ్రైనేజీలు, రోడ్డుకు ఇరువైపులా వేసిన చెత్త కుప్పలు, పెరిగిన కంప చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రానికి ఎంపీడీవో ప్రత్యేకాధికారిగా ఉన్నా.. ఏనాడూ గ్రామాన్ని పట్టించుకోలేదు. పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మట్టపల్లి లక్ష్మీనరసింహుడి ఆలయ పరిసరాలు, గ్రామ పంచాయతీలు, తండాల్లో కూడా పారిశుధ్య పనులు, డ్రైనేజీల పూడికతీత పనులను తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎవరు డబ్బులు ఇవ్వకున్నా.. ఇడిశేది లేదు!

## ఎన్నికల్లో రూ. కోట్లు ఖర్చు చేసినా.. వాటిని రాబట్టుకుంటున్నా

- రోజుకూ రూ.లక్ష ఖర్చవుతున్నది.. ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోతలే..
- తుంగతుర్తి ఎమ్మెల్యేపై స్టింగ్ ఆపరేషన్
- లిక్కర్ సిండికేట్ నిర్వాహకులను డబ్బులు అడుగుతున్న వీడియో వైరల్

**తాను గత ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచాను... నేను మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు... నా డబ్బులు నేను రాబట్టుకోవాల్సిందే... ఎవ్వరు డబ్బులు ఇవ్వకున్నా వాడిని ఇడిశేది లేదంటూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నది.**





సూర్యాపేట, జూన్ 10 (నమస్తే తెలంగాణ): తుంగతుర్తి ఎమ్మెల్యేకు సొంత పార్టీ నేతలతో పొసగటం లేదు. నెలకోసారి సొంత పార్టీ నేతలే తూర్పారబడుతున్నారు. కాంట్రాక్టులన్నీ ఎమ్మెల్యే కుటుంబమే చేసుకుంటూ పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదు... ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు తరచూ ఆరోపిస్తున్నారు. ఇసుక విషయంలో తట్టెడు కూడా ఎత్తనివ్వనని ఎన్నికల ముందు ఊరూరా తిరిగి ప్రచారం చేసి.. నేడు ఆయన కుమారులతో దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు వీడియోలు సహా గతంలో బహిరంగపరిచారు. శాలిగౌరారం మండలానికి చెందిన వ్యక్తిని పోలీసులకు చెప్పి చితక బాదించిన ఎమ్మెల్యే తీరుతో నాగరాజు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అప్పట్లో సంచలనం సృష్టించింది. అర్వపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నేత యోగానందాచార్యులు నేతృత్వంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం తలపెట్టడం...ఆ వెంటనే అర్ధరాత్రి సొంత పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయించడంపై నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వర్గపోరు చర్చనీయాంశమైంది. వీటికి తోడు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మోత్కూరులో వేలాది మందితో నిర్వహించిన సభతో తుంగతుర్తి కాంగ్రెస్ కుమ్ములాటలు తారస్థాయికి చేరుకున్నాయి. అడ్డగూడూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గూడెపు నాగరాజు పేరిట తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లుగా నియోజకవర్గ వ్యాప్తంగా సోషల్ మీడియాలో పోస్టులు చెక్కర్లు కొట్టాయి. ఇలా అనేకసార్లు తుంగతుర్తి కాంగ్రెస్‌లో కుమ్ములాటలు... ఎమ్మెల్యే సామేల్‌పై ఆరోపణలు వస్తుండగా తాజాగా ఎమ్మెల్యే సామెల్ మరో వివాదంలో ఇరుక్కోవడం గమనార్హం. లిక్కర్ సిండికేట్ నిర్వాహకుల నుంచి ఎమ్మెల్యే మామూళ్లు అంటూ ఓ వీడియో వైరల్ అవుతుండగా వైన్స్ యజమానులతో ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అర్థం అవుతున్నది. ఎమ్మెల్యే సామేల్‌తో బేరసారాలాడుతూ లిక్కర్ మాఫియా స్టింగ్ ఆపరేషన్ చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే మామూళ్ల వ్యవహారం బయట పెట్టాలనే ఉద్దేశంతోనే సీక్రెట్ కెమెరాతో సిండికేట్ మాఫియా ఆపరేషన్ చేసిందని ప్రచారం. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టా రికవరీ కావాలి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదంటూ తనకు రోజుకూ రూ.లక్ష ఖర్చు వస్తుంది డీజిల్‌కు కూడా డబ్బులు లేవు ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోవడంలేదు.. మీరిచ్చే మామూళ్లు నాకు టీ ఖర్చులకు కూడా సరిపోవు అంటూ.. తన మాట వినని వారి సంగతి చూస్తా అని వైరల్ అవుతున్న వీడియోలో ఎమ్మెల్యే సామేల్ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ వీడియో ప్రతిపక్షాలతో పాటు స్వపక్షంలో విపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతల చేతికి చిక్కడంతో ఎమ్మెల్యే సామేల్ వసూళ్ల వ్యవహారం వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది.

### అసత్య ఆరోపణలు చేసిన వారిని వదలను

**లిక్కర్ దందాలో తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వీడియో తీసిన వ్యక్తులపై విచారణ జరిపించాలని తుంగతుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితుడని ఓర్వలేక కొంతమంది కావాలనే కుట్ర చేశారని పేర్కొన్నారు. నా ఇంట్లోకి వచ్చి టీ తాగి ఇంకా వీడియోలు ఉన్నాయని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని అలాంటి వారిని చట్టపరంగా విచారణ జరిపి దోషులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. చిల్లర దందాలకు పాల్పడే వ్యక్తి మందుల సామేల్ కాదన్నారు.**

– ఎమ్మెల్యే సామేల్

# నకిలీ పత్తి విత్తనాలు సీజ్

### రెండు కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్టు • వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్, జూన్ 10: గడ్డి మందులను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చేవని చెబుతూ రైతులను మోసం చేస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, రూ 65లక్షల విలువైన 22క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న ఉదయం ఆత్మకూర్.ఎస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతర్లపహాడ్ స్టేజీ వద్ద సీసీఎస్, ఆత్మకూర్.ఎస్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానంగా ఉన్న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన తండా నగేష్ 120ప్యాకెట్ల నకిలీ విత్తనాల గోనె సంచిని బండిపై పెట్టుకుని వెళుతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తాను ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన పంది రాములు వద్ద విత్తనాలు తెస్తున్నట్లు అంగీకరించాడు. ఈ విత్తనాలు గడ్డి మందు తట్టుకునేదని అధిక దిగుబడిని ఇచ్చేదని చెప్పి రైతులను మోసం చేస్తున్నట్లు గుర్తించి నగేష్‌తో పాటు పంది రాములు, నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మైలవరం గ్రామానికి చెందిన విత్తన దుకాణాదారు బానోత్ జయరాం, గుంటూరు బాలాజీనగర్‌కు చెందిన తరిగొప్పుల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. జయరాం షాపులో నిల్వ చేసిన 37బస్తాల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ. 63లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నకిలీ విత్తనాలను జిల్లా మొత్తం విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకొని రైతులకు నకిలీ విత్తనాలు చేరకుండా చేశామన్నారు. ఈ కేసులో బాపట్ల జిల్లా ఇంకోలు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు, కర్నూలు జిల్లా పల్లిపాడుకు చెందిన చెవుల నర్సింహులు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుడు సాంబశివరావు ఎండీగా వ్యవహరిస్తూ అరుణోదయ అనే విత్తన కంపెనీ నిర్వహిస్తూ నకిలీ విత్తన ప్యాకెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించామని వీరిని త్వరలోనే అదుపులోకి తీసుకుని రిమాండ్ చేస్తామన్నారు. అలాగే మోతె మండలం రావిపహాడ్‌లో వెలుగు శ్రీను నివాసంలో అడ్వాన్స్ 333, అరుణోదయ కంపెనీ పేర్లతో ఉన్న 98 నకిలీ పత్తి విత్తనాలు గుర్తించి సీజ్ చేశామన్నారు. నిందితున్ని విచారించగా తనకు బంధువైన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చర్లపల్లి శాతవాహనతో కలిసి మోతె మండల, పరిసర గ్రామాల్లో, జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ ఈ విత్తనాలు గడ్డి మందును తట్టుకునేవని అధిక దిగుబడి ఇచ్చే మంచిరకం పత్తి విత్తనాలు అని నమ్మించి ఈ నకిలీ విత్తనాలు అమ్ముతున్నానని తెలిపాడు. దీంతో నిందితుడు వెలుగు శ్రీనును అరెస్టు చేసి రూ. 2లక్షల విలువైన 58కిలోల నకిలీ విత్తనాలు సీజ్ చేశామన్నారు. వీరికి విత్తనాలు సరఫరా చేస్తున్న నిందితుడు తిరుమల్ కర్ణాటక రాష్ట్రం నలుగునూర్ అని నిందితున్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులు నకిలీ విత్తనాల గుర్తించి అప్రమత్తంగా ఉండాలని విడి విత్తనాలతో అధిక ప్రమాదమని గమనించాలన్నారు. ఎవరైనా మధ్యవర్తులు విత్తనాలు అమ్ముతున్నామంటే నమ్మి కొనుగోలు చేయవద్దని నమ్మకమైన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయడం మేలని కంపెనీ విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని అవసరమైతే వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేసిన కేసుల్లో బాగా పనిచేసిన సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ విద్యాసాగర్‌రావు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్, కానిస్టేబుల్ ఆనంద్, మల్లేశ్, సతీశ్, శివకృష్ణ, ప్రభాకర్, మహిళా హోంగార్డు మంజుల, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఆత్మకూర్.ఎస్ ఎస్ఐ శ్రీకాంత్, మోతె ఎస్ఐ యాదవేందర్, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ ఉన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ